సాక్షి
కాకినాడ


ఆదివారం । 28 । ఏప్రిల్ । 2024



పెన్‌టాస్టిక్

8లో

ఇప్పటి వరకూ పాఠశాలల్లోని విద్యార్థులకు చైల్డ్ ఐడీ కేటాయించిన విద్యా శాఖ ఇకపై పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్ (పెన్) ఇవ్వాలని నిర్ణయించింది.



5,950 క్యూసెక్కుల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం తూర్పు డెల్టాకు 1,500, మధ్య డెల్టాకు 1,100, పశ్చిమ డెల్టాకు 3,350 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

గరిష్టం/కనిష్టం
43.5° / 26.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	43.5	26.0
కాకినాడ	39.6	27.0
అమలాపురం	40.0	26.0

న్యూస్‌రీల్

పాలిసెట్‌కు 91.47 శాతం హాజరు

బాలాజీ చెరువు (కాకినాడ సిటీ): పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ పాలిసెట్ జిల్లాలో శనివారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నిర్వహించిన ఈ పరీక్షకు విద్యార్థులను గంట ముందుగానే పరీక్ష హాలులోనికి అనుమతించారు. పరీక్షకు 9,573 మంది దరఖాస్తు చేసుకోగా 8,846 మంది (92.41 శాతం) హాజరయ్యారు. వీరిలో బాలురు 5,146 మంది, బాలికలు 3,700 మంది ఉన్నారని ఏపీ పాలిసెట్–2024 జిల్లా కోఆర్డినేటర్ జనార్దనరావు తెలిపారు.

నేడు 14 మండలాల్లో వడగాల్పులు

కాకినాడ సిటీ: జిల్లాలోని 14 మండలాల్లో ఆదివారం వడగాల్పులు వీచే అవకాశం ఉందని కలెక్టర్ జె.నివాస్ శనివారం విలేకర్లకు తెలిపారు. ఏలేశ్వరం, గండేపల్లి, గొల్లప్రోలు, జగ్గంపేట, కిర్లంపూడి, కోటనందూరు, పెదపూడి, పెద్దాపురం, పిఠాపురం, ప్రత్తిపాడు, రౌతులపూడి, సామర్లకోట, తుని, శంఖవరం మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని వివరించారు. పెద్దాపురం, రౌతులపూడి, సామర్లకోట మండలాల్లో శనివారం అత్యధికంగా 41.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని తెలిపారు. ప్రజలు వీలైనంత వరకూ ఉదయం 11 గంటల నుంచి ఇంట్లోనే ఉండాలని, వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

పోలింగ్ సజావుగా నిర్వహించాలి

కాకినాడ సిటీ: పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు మైక్రో అబ్జర్వర్లు కృషి చేయాలని సార్వత్రిక ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు ఎస్.గణేష్, రాజేష్ జోగ్ పాల్ అన్నారు. జెడ్పీ సమావేశపు మందిరంలో శనివారం జరిగిన మైక్రో అబ్జర్వర్ల శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ మాట్లాడుతూ, జిల్లాలో 356 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని తెలిపారు. ఈ కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్లు విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని, వీరందరూ జిల్లా సాధారణ పరిశీలకుల ఆధ్వర్యంలో పని చేస్తారని చెప్పారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేస్తున్న సుమారు 419 మంది ఉద్యోగులు పాల్గొన్నారని తెలిపారు. గణేష్ మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై అవగాహన పెంపొందించుకుని, నివేదికలు సక్రమంగా అందించాలని మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. పోలింగ్ రోజున తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ ప్రక్రియ ప్రారంభానికి గంటన్నర ముందు మైక్రో అబ్జర్వర్లు మాక్ పోల్ నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రంలో విద్యుత్, నీటి సరఫరా, ర్యాంప్, ఇతర సదుపాయాలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. రాజేష్ జోగ్‌పాల్ మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాల్లో ఎటువంటి సమస్యాత్మక సంఘటనలు చోటు చేసుకున్నా వెంటనే పరిశీలకుల దృష్టికి తీసుకుని రావాలని ఆదేశించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ హెచ్‌ఎస్ భావన, జెడ్పీ డిప్యూటీ సీఈఓ జీఎస్ రామ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మేనిఫెస్టివల్

- వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోపై సర్వత్రా హర్షం
- వైఎస్ జగన్ చెప్పారంటే చేస్తారంటున్న ప్రజలు
- తు.చ. తప్పకుండా అమలు చేస్తారని విశ్వాసం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఆయన మాట ఇచ్చారంటే కచ్చితంగా చేసి తీరుతారని ప్రతి ఒక్కరూ నూరు శాతం నమ్ముతారు. చెప్పారంటే.. చేస్తారంతే అనే మాట ఆయన విషయంలో అక్షరాలా నిజమని విశ్వసిస్తారు. గడచిన ఐదేళ్లలో ప్రభుత్వాధినేతగా ఆయన అమలు చేసిన విధానాలు, ఆచరణే అందుకు గీటురాయి. అందువల్లనే ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం విడుదల చేసిన పార్టీ ఎన్నికల మేనిఫెస్టోపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ప్రతిపక్ష నేతగా 2019 ఎన్నికలకు ముందు నిర్వహించిన ప్రజాసంకల్ప యాత్రలో ప్రజల కష్టాలు, కడగండ్లను కళ్లారా చూసిన ఆయన.. అప్పట్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం పైగా అమలు చేసి చూపించారు. ఏరు దాటిన తరువాత తెప్ప తగలేసిన చందంగా వ్యవహరించిన 'పచ్చ' పాలకులు 2014 ఎన్నికల మేనిఫెస్టోను ఏకంగా ఆ పార్టీ వెబ్‌సైట్ నుంచే మాయం చేసేశారు. దీనికి భిన్నంగా వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోను ఒక భగవద్గీత, ఒక బైబిల్, ఒక ఖురాన్‌లా భావించి, అందులో చెప్పినవే కాకుండా.. చెప్పని అనేక పథకాలు, కార్యక్రమాలను గడచిన ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారు. అందువల్లనే పార్టీ అధినేతగా సీఎం జగన్ తాజాగా విడుదల చేసిన వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోను కూడా ప్రజలు బలంగా నమ్ముతున్నారు. సర్వజనహితంగా.. సమగ్ర ప్రగతి దీపికగా రూపొందించిన ఈ మేనిఫెస్టోలో వివిధ వర్గాలకు అమలు చేస్తున్న సంక్షేమాన్ని కొనసాగించడం, పెంచడంతో పాటు, పెద్ద ఎత్తున చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలను కూడా సీఎం జగన్ వివరించారు. తాజా మేనిఫెస్టోపై ఏ వర్గాన్ని కదిపినా హర్షం వ్యక్తమైంది. సీఎం జగన్ చెప్పిన మాట చెప్పినట్టుగా అమలు చేసి తీరుతారనే నమ్మకాన్నే కనబరిచారు.

స్కిల్ హబ్‌తో యువతకు ఉపాధి అవకాశాలు



ప్రతి నియోజకవర్గానికి స్కిల్ హబ్ ఏర్పాటు చేస్తామని వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోలో పేర్కొనడం అభినందనీయం. యువతకు ఉద్యోగావకాశాలు పెంపొందించేందుకు స్కిల్ హబ్‌లు దోహదం చేస్తాయి. నైపుణ్యం పెంచడం ద్వారా పెద్ద పెద్ద కంపెనీల్లో యువతకు ఉద్యోగాలు లభించే అవకాశాలు కలుగుతాయి. చాలా మంది నిరుద్యోగులు, విద్యార్థులు స్విగ్గీ, జొమాటో వంటి సంస్థల్లో పార్ట్‌టైమ్‌గా పని చేస్తున్నారు. వైఎస్సార్ జీవన బీమా వర్తింపజేయడంతో వారికి ప్రయోజనం కలుగుతుంది. ప్రతి జిల్లాలో ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ కార్యక్రమం ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావించే ముఖ్యమంత్రి జగన్‌పై నమ్మకం ఉంది. 2019 నుంచి తు.చ. తప్పకుండా హామీలు అమలు చేయడంతో 2024 మేనిఫెస్టోపై నమ్మకం పెరిగింది.

– **కోలా మణికిరణ్**, డిగ్రీ విద్యార్థి, తిమ్మాపురం, కాకినాడ రూరల్

ప్రతి ఒక్కరికీ సొంతిల్లు ఇస్తామనడం హర్షణీయం



పేదలందరికీ సొంతిళ్ల నిర్మాణం కొనసాగిస్తామని వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోలో హామీ ఇవ్వడం హర్షణీయం. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి మించి దేశ చరిత్రలోనే ఎక్కడా, ఎప్పుడూ లేని విధంగా 32 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారు. స్థలాలు పొందిన వారు ఇళ్లు నిర్మించుకునే విధంగా ఆర్థిక సహాయం చేశారు. దీంతో సామర్లకోట, వేట్లపాలెం, జి.మేడపాడు, పవర గ్రామాల్లో జగనన్న కాలనీలు అందంగా, గ్రామాల్లా రూపుదిద్దుకున్నాయి. మొదటి దశలో మిగిలిపోయిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడంతో పాటు పేదలందరికీ ఇళ్ల నిర్మాణం కొనసాగిస్తామని హామీ ఇవ్వడం ఆనందంగా ఉంది. ఇది పూర్తయితే రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేదలు ఉండే అవకాశం ఉండదు. ఇప్పటికే అనేక మంది సొంతింటి కల నెరవేరింది. నెరవేర్చగలిగే హామీలను మాత్రమే సీఎం జగన్ ఇస్తారు.

– **మలకల సత్య**, గృహిణి, పీబీ దేవం, సామర్లకోట మండలం

విద్యారంగ అభివృద్ధి జగన్‌కే సొంతం



విద్యారంగంలో ఏ ప్రభుత్వమూ చేపట్టని సంస్కరణలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుని వచ్చారు. ప్రభుత్వ పాఠశాలలను చూస్తుంటే గత ప్రభుత్వానికి, ఇప్పటికీ ఉన్న మార్పు చాలా స్పష్టంగా కనిపిస్తోంది. మౌలిక సదుపాయాల కల్పన ఒక ఎత్తయితే విద్యా విధానంలో తీసుకువస్తున్న మార్పులు పేద విద్యార్థుల అభివృద్ధికి నాంది పలుకుతున్నాయి. 2025 నుంచి ఒకటో తరగతి నుంచి ఐబీ విద్యా విధానం ప్రవేశపెడతామని మేనిఫెస్టోలో ప్రకటించడం సంతోషంగా ఉంది. గత ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పకపోయినా రెట్టింపు స్థాయిలో అభివృద్ధి చేశారు. స్మార్ట్ టీవీలతో బోధన, ట్యాబ్‌ల పంపిణీ, ఇంగ్లిష్ ల్యాబ్‌ల వంటి వాటితో కార్పొరేట్ పాఠశాలలను తలపించేలా కొత్తదనం తీసుకుని వచ్చారు. అమ్మ ఒడి పథకం సాయం మరింత పెంచనున్నట్టు కొత్త మేనిఫెస్టోలో ప్రకటించారు. విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించి సరికొత్త సంస్కరణలకు నాంది పలుకుతూండటం ఆనందంగా ఉంది.

– **డాక్టర్ రిక్కీ గూటం**, కాకినాడ

వ్యవసాయాన్ని పండగ చేశారు



మాకు ఎనిమిదెకరాల పంట పొలం ఉంది. రైతు భరోసాగా రూ.50 వేలు ఇస్తామని చెప్పినా, రైతుల ఇబ్బందులు గమనించి చెప్పినదానికి మించి ఐదేళ్లలో రూ.67,500 ఇచ్చారు. అధిక వర్షాలు, తుపాన్లకు రెండేళ్ల క్రితం నీట మునిగి పంట నష్టపోతే, ఉచిత పంటల బీమా పథకంలో రూ.1.50 లక్షలు వచ్చింది. పంటకు రైతు భరోసా కేంద్రం ద్వారా ప్రభుత్వ మద్దతు ధర దక్కుతోంది. గతంలో దళారీలతో బస్తాకు రూ.100 నుంచి రూ.150 నష్టపోయేవాళ్లం. ఆర్‌బీకేల ద్వారా సాగు మెళకువలు చెప్పడమే కాకుండా విత్తనం నుంచి విక్రయం వరకూ రైతుకు అండగా ఉంటున్నారు. వ్యవసాయాన్ని సీఎం జగన్ పండగలా మార్చారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యవసాయం దండగ అని హేళన చేయడమే కాకుండా, 2014 ఎన్నికల్లో రైతు రుణమాఫీ చేస్తానని చెప్పి బాండ్ పేపర్లు ఇచ్చారు. అవి ఎందుకూ పని చేయలేదు. పేరుకే పంటల బీమా ఉండేది. వరదలొచ్చి పంట నష్టపోతే పరిహారం ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. అసలు వస్తుందో రాదోనన్న దిగులుతో ఉండేవాళ్లం. అందుకే చంద్రబాబు ఎన్ని హామీలిచ్చినా చేస్తాడనే నమ్మకం లేదు. సీఎం జగన్ వచ్చాక చెప్పాడంటే చేస్తాడనే నమ్మకం కుదిరింది. ఈ ఎన్నికల మేనిఫెస్టోలో రైతుభరోసాను మరో రూ.2,500 పెంచి ఐదేళ్లలో రూ.80 వేలు అందిస్తామని చెప్పడం, సున్నా వడ్డీకే పంట రుణాలు అందించడం, ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే అదే సీజన్‌లో ఉచిత పంటల బీమా మంజూరు చేయడం వంటి హామీలన్నీ రైతులకు సీఎం జగన్ ఇస్తున్న వరాలుగా భావిస్తున్నాం.

– **వెలుగుబంట్ల రవినాయుడు**, రైతు, కూరాడ, కరప మండలం

నూరు శాతం నెరవేరుస్తారు



చిన్నతనంలోనే బేకరీ ఫుడ్ ఐటమ్స్ తయారీ నేర్చుకున్నాను. ఆ అనుభవంతోనే ఇంటి వద్ద చిన్న మొత్తంలో బేకరీ ఫుడ్ ఐటమ్స్ తయారు చేసి, స్థానికంగా ఉన్న షాపులకు విక్రయించుకునేదాన్ని. పొదుపు సంఘం సభ్యురాలిగా ప్రభుత్వ రుణం తీసుకున్నాను. 2019 ఎన్నికల మేనిఫెస్టోలో వైఎస్సార్ ఆసరా, జీరో వడ్డీ రుణ పథకాలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. చెప్పినట్టుగానే ఏటా రూ.16 వేల చొప్పున నాలుగు సంవత్సరాల్లో రూ.64 వేల రుణమాఫీ చేశారు. కొత్త మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు కూడా నూరు శాతం నెరవేరుస్తారనే నమ్మకం ఉంది.

– **అళ్ల దుర్గా మహాలక్ష్మి**, చిల్లంగి, కిర్లంపూడి మండలం

జగన్‌లా ఎవ్వరూ చేయలేరు



నేను చేపల వేటతో జీవనం సాగిస్తుంటాను. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019లో మాతో కాకినాడలో నిర్వహించిన మత్స్యకార సమ్మేళనంలో ఏం చెప్పారో అదే మేనిఫెస్టోలో పెట్టారు. అందులో పెట్టిన దానికంటే ఎక్కువ చేసి చూపించారు. గత 50 ఏళ్లలో ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా మత్స్యకారులకు అనేక పథకాలు ఇచ్చారు. మత్స్యకార భరోసా పెంచి, రూ.లక్ష వరకూ ఆర్థికంగా ఆదుకుంటామని ప్రస్తుత మేనిఫెస్టోలో ప్రకటించారు. ఆయన అన్నారంటే చాలు.. మాకు జరిగిపోయినట్టే. ఇంతకు ముందు చెప్పింది చెప్పినట్టు చేశారు కాబట్టే అంత నమ్మకం కలిగించారు. ఆయనలా ఎవ్వరూ చేయలేరు. అందుకే మా మత్స్యకారులంతా మళ్లీ ఆయనే రావాలని కోరుకుంటున్నాం. ఎవరెన్ని చెప్పినా మా ఓట్లు జగన్‌కే వేసి మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటాం.

– **కంబాల రాంబాబు**, మత్స్యకారుడు, ఉప్పాడ, యు.కొత్తపల్లి మండలం

వైద్యంపై దృష్టి సారించడం అభినందనీయం



ప్రజలందరూ ఆరోగ్యంగా జీవించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక వినూత్న పథకాలు ప్రవేశపెట్టింది. దేశంలో ఎక్కడా లేని విధంగా ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల చెంతకే వైద్యులను తీసుకుని వచ్చింది. ప్రభుత్వాస్పత్రుల్లో అత్యాధునిక సౌకర్యాలు సమకూర్చడంతో పాటు, వైద్యులు, సిబ్బంది నియామకాలు పెద్ద ఎత్తున చేపట్టింది. నేడు స్థానికంగానే అనేక రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో 3,257కు పైగా రోగాలను చేర్చడంతో పాటు, దీని చికిత్స పరిమితిని ఏకంగా రూ.25 లక్షలకు పెంచింది. ప్రతి 2,500 జనాభాకు ఒక విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేసి, వైద్య పరీక్షలు నిర్వహించి, మధుమేహం, రక్తపోటు, హైపోథైరాయిడ్ వంటి వ్యాధులతో బాధ పడుతున్న వారిని గుర్తించి, స్థానికంగానే చికిత్స అందిస్తున్నారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు ప్రవేశపెట్టి, పేదల ఆరోగ్యంపై దృష్టి సారించేలా మేనిఫెస్టో రూపొందించడం అభినందనీయం.

– **లింగం రవి**, అధ్యక్షుడు, రాయుడుపాలెం వెల్ఫేర్ అసోసియేషన్, కాకినాడ

వాస్తవానికి దగ్గరగా..



చంద్రబాబు మేనిఫెస్టో చూస్తే ఓడ ఎక్కక ముందు ఓడ మల్లన్న.. దిగిన తరువాత బోడి మల్లన్న అన్నట్టుగా ఉంటుంది. మేనిఫెస్టో అంటే ఆయనకు ఒక మాయాపత్రం. చంద్రబాబు సూపర్ సిక్స్ మేనిఫెస్టోలో పేర్కొన్న వాగ్దానాలు కర్ణాటక, తమిళనాడు నుంచి కాపీ కొట్టినవే. అటువంటి అబద్ధాలు, అభూతకల్పనలు వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోలో లేవు. చేయగలిగనవే చెబుతానని అన్నట్టుగానే సీఎం జగన్ విడుదల చేసిన మేనిఫెస్టో ఉంది. పేదలు, బడుగు, బలహీనవర్గాలకు 2019లో మేనిఫెస్టోలో చెప్పని చాలా అంశాలను అమలు చేసి చూపించారు. పేదలందరికీ ఇళ్ల నిర్మాణం ఇక ముందు కూడా కొనసాగిస్తామన్నారు. వాహన మిత్రను యజమానులుగా ఉన్న టిప్పర్ డ్రైవర్లకు కూడా వర్తింపజేసి, రూ.10 లక్షల వరకూ బీమా అమలు చేస్తామన్నారు. ఇప్పటికే అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తామని చెప్పారు. వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో వాస్తవానికి దగ్గరగా ఉంది. అమలు చేసే హామీలే జగన్ ఇస్తారు. అన్ని వర్గాలకూ సమానంగా సుపరిపాలన అందించడమే సీఎం జగన్ లక్ష్యం.

– **కురసాల కన్నబాబు**, వైఎస్సార్ సీపీ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి, పార్టీ జిల్లా అధ్యక్షుడు

సీఎం జగన్‌తోనే ఉపాధి కల్పన

- పేదల ఆర్థికాభివృద్ధే ఆయన ప్రధాన లక్ష్యం
- ముద్రగడ పద్మనాభం



ముద్రగడతో వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం తదితరులు

కిర్లంపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే నిరుద్యోగులకు ఉపాధి కల్పన సాధ్యమని కాపు ఉద్యమ నేత, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం అన్నారు. వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం, ఆయన తనయుడు రాంజీతో పాటు కిర్లంపూడి మండలంలోని వేలంక, రామకృష్ణాపురం, సింహాద్రిపురం, రాజుపాలెం గ్రామాల నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ముద్రగడను, యువ నాయకుడు గిరిబాబును కిర్లంపూడిలోని వారి నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ, పేదల కష్టాలు తెలుసుకోవడమే కాకుండా వారి ఆర్థికాభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎంపీ, ఎమ్మెల్యేల సహకారంతో నిరుద్యోగులు వారి గ్రామాల్లో చిన్నచిన్న పరిశ్రమలు నెలకొల్పడానికి సబ్సిడీ రుణాలు అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. తద్వారా వారి పిల్లల భవిష్యత్తుకు ఆర్థిక భరోసా కలుగుతుందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను, జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహాన్ని అఖండ మెజార్టీతో గెలిపించి వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంను చేయాలని అభ్యర్థించారు. ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం మాట్లాడుతూ, రాష్ట్ర రాజకీయాల్లో క్రియాశీలక నాయకుడు ముద్రగడ పద్మనాభం చేరికతో వైఎస్సార్ సీపీకి మరింత బలం చేకూరిందని అన్నారు. ఆయన సూచనలు, సలహాలతో రెట్టించిన ఉత్సాహంతో ప్రచారం కొనసాగిస్తామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాజకీయాలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా అనేక సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో తనను, ఎంపీ అభ్యర్థి సునీల్‌ను గెలిపించి జగన్‌ను మళ్లీ సీఎంను చేయాలని అభ్యర్థించారు.

సత్యదేవుని కల్యాణానికి సన్నాహాలు

- వచ్చే నెల 18 నుంచి ఉత్సవాలు
- 24 వరకూ నిర్వహణ
- 19న స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవం
- ఏర్పాట్లపై నేడు సమన్వయ సమావేశం

అన్నవరం: రత్నగిరి వాసుడు, భక్త వరదుడు, అనంత లక్ష్మీ సత్యవతీ సమేతుడైన సత్యదేవుని వార్షిక దివ్య కల్యాణ మహోత్సవాలు వచ్చే నెల 18 నుంచి 24వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించేందుకు ప్రభుత్వ, దేవస్థానం అధికారుల సమన్వయ సమావేశం రత్నగిరిపై ఆదివారం సాయంత్రం నిర్వహిస్తున్నారు. ప్రకాష్ సదన్‌లోని ట్రస్ట్ బోర్డు హాలులో పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు అధ్యక్షతన ఈ సమావేశం జరగనుంది. దేవస్థానం తరఫున చేస్తున్న ఏర్పాట్లను ఈఓ కె.రామచంద్ర మోహన్ వివరించనున్నారు. వచ్చే నెల 19న వైశాఖ శుద్ధ ఏకాదశి రాత్రి 9 గంటల నుంచి జరగనున్న సత్యదేవుని దివ్య కల్యాణ మహోత్సవానికి వేలాదిగా భక్తులు తరలి రానున్నందున ఎటువంటి ఏర్పాట్లు చేయాలనే అంశంపై కూడా ఈ సమావేశంలో ప్రధానంగా చర్చిస్తారు. ఎన్నికల కోడ్ కారణంగా ఈసారి కల్యాణ మహోత్సవాలకు హాజరయ్యే ప్రజాప్రతినిధులకు కూడా సాధారణ భక్తులకు ఇచ్చే సదుపాయాలు మాత్రమే కల్పించనున్నారు.

వీటిపై చర్చిస్తారా..!

- సత్యదేవుని దివ్య కల్యాణోత్సవానికి 10 వేల మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉంది. స్వామివారి వార్షిక కల్యాణ వేదిక ముందున్న విశ్రాంతి షెడ్డులో సుమారు 2 వేల మంది మాత్రమే కూర్చునే అవకాశం ఉంది. మిగిలిన వారు ఆ షెడ్డుకు ఇరువైపులా ఆవరణలో ఉండి తిలకించేలా పెద్ద స్క్రీన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది.
- భక్తులకు మంచినీరు, కల్యాణం అనంతరం అన్నదాన పథకంలో ఉచిత ఫలహారం రెండు మూడుచోట్ల పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఫలహారం కూడా ప్యాకెట్లుగా పంపిణీ చేస్తే భక్తులు వాటిని తీసుకుని వెళ్లిపోయే అవకాశం ఉంటుంది.
- కల్యాణం అనంతరం ఉచిత ప్రసాదం, తలంబ్రాల పంపిణీ విషయంలో ఏటా గందరగోళం తలెత్తుతోంది. స్వామివారి సర్క్యులర్ మండపంతో పాటు మరో రెండుచోట్ల పంపిణీ చేస్తే సౌకర్యవంతంగా ఉంటుంది.



- పంపా జలాశయంలోని నీటిని రబీ సాగుకు విడుదల చేశారు. దీనికి ఎండలు తోడవడంతో ప్రస్తుతం పంపా నది పూర్తిగా ఎండిపోయింది. ఉత్సవాల్లో ఆరో రోజున స్వామివారి శ్రీచక్ర స్నానం నదిలో నిర్వహించాలంటే కనీసం 4 అడుగుల నీటిమట్టం ఉండాలి. ఈ సమస్యను వివరిస్తూ 'ఎండిపోయి'నది'' శీర్షికన ఈ నెల 10న 'సాక్షి' కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన ఈఓ కె.రామచంద్ర మోహన్ సత్యదేవుని ఉత్సవాలకు తగినంత నీటిని ఏలేరు రిజర్వాయర్ నుంచి విడుదల చేయాలని జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. దీనిపై ఈ సమావేశంలో చర్చించాలి.
- భారీగా వచ్చే భక్తులను నియంత్రించేందుకు పెద్ద సంఖ్యలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.
- కల్యాణ మహోత్సవం రోజున ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు చిన్న, ద్విచక్ర వాహనాలు మినహా మిగిలిన వాటిని కొండ దిగువనే నిలిపి వేయాలి. భక్తులను కొండ మీదకు తరలించేందుకు సుమారు 20 బస్సులు వినియోగించాలి.
- పశ్చిమ, తూర్పు రాజగోపురాలు, పార్కింగ్ స్థలాల వద్ద భక్తుల సౌకర్యార్థం అధిక సంఖ్యలో టాయిలెట్లు ఏర్పాటు చేయాలి.
- కల్యాణోత్సవాల సందర్భంగా 18 నుంచి 22వ తేదీ వరకూ ఐదు రోజుల పాటు స్వామివారిని వివిధ వాహనాల్లో కొండ దిగువన ఊరేగిస్తారు. స్వామివారి ఊరేగింపు కోసం రూ.1.08 కోట్లతో రూపొందించిన భారీ టేకు రథాన్ని శుక్రవారం లాంఛనంగా ప్రారంభించిన విషయం విదితమే. దీనిపై 22వ తేదీ రాత్రి స్వామి, అమ్మవార్లను ఘనంగా ఊరేగించనున్నారు. ఆ ఊరేగింపు తిలకించడానికి భారీగా భక్తులు వస్తారు. ఆ రోజు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.
- ఉత్సవాల చివరి రోజున మే 24న జరగనున్న సత్యదేవుని శ్రీపుష్పయాగం స్వామివారి నిత్యకల్యాణ మండపంలోనే నిర్వహిస్తారు. అదే విధంగా గోటితో ఒలిచే తలంబ్రాలు సంప్రదాయం ఇక్కడ లేనందున దానిని నిలిపివేస్తున్నారు.
- కల్యాణ మహోత్సవాలు జరిగే ఏడు రోజులూ అన్నవరం పంపా సత్రం వద్ద వైన్ షాపులను 48 గంటల ముందు నుంచే బంద్ చేసేలా చర్యలు తీసుకోవాలి.
- కల్యాణోత్సవాల ఏడు రోజులూ దేవస్థానానికి విద్యుత్ సరఫరా నిరంతరాయంగా జరిగేలా చర్యలు చేపట్టాలి.
- సుమారు వంద మంది అదనపు సిబ్బందితో పారిశుధ్య ఏర్పాట్లు చేయాలి.
- స్వామివారి కల్యాణోత్సవానికి దూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు రానున్నందున అన్నవరానికి అదనపు బస్సులు నడపాలి.
- ఉత్సవాల సందర్భంగా దేవస్థానంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా రత్నగిరిపై అగ్నిమాపక శకటంతో సిబ్బందిని అందుబాటులో ఉంచాలి.

క్లుప్తంగా

వేర్వేరు రైలు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



గుర్తు తెలియని వ్యక్తి

తుని రూరల్: వేర్వేరు రైలు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందినట్టు గవర్నమెంట్ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్సై షేక్ అబ్దుల్ మారూఫ్ శుక్రవారం తెలిపారు. తుని మండలం హంసవరం, అన్నవరం మధ్య రైలులో ప్రయాణిస్తూ జారిపడడంతో గుర్తు తెలియన వ్యక్తి (45) మృతి చెందాడన్నారు. ఇతని శరీరంపై తెలుపు రంగుపై నల్ల చుక్కల చొక్కా, సిమెంట్ రంగుపై నలుపు అడ్డగీతల ఫ్యాంట్ ఉందన్నారు. కుడి మోచేయిపై ఎస్‌హెచ్‌హెచ్ అనే పచ్చబొట్టు ఉంది. మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రిలో భద్రపర్చారు. అదేవిధంగా తుని ఏరియా ఆస్పత్రిలో మరో గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై మారూఫ్ తెలిపారు. రైలు నుంచి జారిపడి తీవ్ర గాయాలతో ఉన్న వ్యక్తిని 108 అంబులెన్సు సిబ్బంది ఆసుపత్రిలో చేర్చారన్నారు. చికిత్స పొందుతూ ఆ వ్యక్తి మృతి చెందడంతో జీఆర్‌పీకి సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా గుర్తిస్తే 94948 87786 నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్

కుమార్తె మృతి, తండ్రికి గాయాలు



గాయపడిన సురేష్‌ను అంబులెన్స్‌లో ఏలూరు ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

నల్లజర్ల: బైపాస్ రహదారిపై దూబచర్ల వద్ద శనివారం సాయంత్రం బైక్ డివైడర్‌ను ఢీకొన్న సంఘటనలో ఓ బాలిక మృతి చెందగా, బైక్ నడుపుతున్న తండ్రి గాయాలతో బయటపడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. కొయ్యలగూడెం మండలం కుంతలగూడేనికి చెందిన కోమటి సురేష్ గత కొంత కాలం కిందట అత్తవారిల్లు నల్లజర్ల మండలం అయ్యావరం వచ్చి నివాసం ఉంటున్నాడు. వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శనివారం దేవరపల్లి మండలం చిన్నయగూడెంలో బంధువుల ఇంటికి సురేష్ తన బైక్‌పై రెండో కుమార్తె హర్షిణి (8)తో కలసి వెళ్లాడు. సాయంత్రం 4 గంటల సమయంలో తిరిగి ఇంటికి వస్తుండగా దూబచర్ల వద్ద బైపాస్ రహదారిపై డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ సంఘటనలో హర్షిణికి తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సురేష్‌కు తీవ్ర గాయాలు కాగా హైవే అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు నల్లజర్ల ఎస్ఐ వెంకటసురేష్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

రావులపాలెం: అక్రమంగా తరలిస్తున్న 3,600 కిలోల రేషన్ బియ్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై ప్రేమ్‌కుమార్ శనివారం తెలిపారు. గోపాలపురం జాతీయ రహదారిపై వ్యవసాయ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా, సిద్ధాంతం వైపు నుంచి రావులపాలెం వైపు వస్తున్న వ్యాన్‌లో పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. వాటిని సీజ్ చేసి వ్యాన్‌లో ఉన్న డ్రైవర్, యాజమానిపై కేసు నమోదు చేశామన్నారు.

పెన్‌టాస్టిక్

- ప్రతి విద్యార్థికీ పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్
- పిల్లల భవిష్యత్‌కు ఇదే కీలకం
- ఇప్పటికే పూర్తయిన ఆన్‌లైన్ ప్రక్రియ



రాయవరం: ఇప్పటి వరకూ ప్రతి విద్యార్థికి చైల్డ్ ఐడీని రాష్ట్ర విద్యా శాఖ కేటాయించింది. దీని ఆధారంగా ఆ విద్యార్థి ఏ పాఠశాలలో, ఏ తరగతి చదువుతున్నదీ ఆన్‌లైన్‌లో తెలుసుకునే వెసులుబాటు ఉంది. ఇకపై చైల్డ్ ఐడీ స్థానంలో పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్ (పెన్) వచ్చింది. పాఠశాలలో అడ్మిషన్ పొందిన ప్రతి విద్యార్థికి పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్ కేటాయిస్తున్నారు. ఇప్పటికే అడ్మిషన్ పొందిన విద్యార్థులకు పెన్ కేటాయించగా, వచ్చే విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు పొందగానే వారికి పెన్ ఇస్తారు. ప్రతి విద్యార్థికి సంబంధించిన అన్ని వివరాలు పెన్‌కు అనుసంధానం చేశారు. ఈ నేపథ్యంలో విద్యార్థి దశలో పెన్ నంబర్ కీలకం కానుంది.

సులువుగా అడ్మిషన్లు

గతంలో ఒక విద్యార్థి ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలలో అడ్మిషన్ పొందాలంటే టీసీ, రికార్డు షీట్, ఆధార్ కార్డు వంటి సర్టిఫికెట్లు అవసరమయ్యేవి. ఇకపై వేరే పాఠశాలలో అడ్మిషన్ పొందాలంటే పెన్ ఆధారంగా సులువుగా అడ్మిషన్ పొందే వీలుంటుంది. ఉదాహరణకు ప్రాథమిక పాఠశాల నుంచి ఐదో తరగతి ఉత్తీర్ణత అనంతరం ఉన్నత పాఠశాలలో అడ్మిషన్ పొందాలంటే ఏ విధమైన సర్టిఫికెట్లు అవసరం లేకుండా పెన్ ఆధారంగా ఈజీగా చేరవచ్చు. విద్యార్థి చేరాలనుకునే పాఠశాలకు పెన్ ఆధారంగా ఆన్‌లైన్‌లో బదిలీ చేస్తారు. ఇలా ఎటువంటి జాప్యం లేకుండా, తల్లిదండ్రులు కోరిన పాఠశాలకు ఏ విధమైన కష్టం లేకుండా అడ్మిషన్ పొందవచ్చు. కొత్తగా ఒకటో తరగతిలో చేరే విద్యార్థులకు మాత్రం అడ్మిషన్ పొందిన అనంతరం పెన్ కేటాయిస్తారు.

పూర్తయిన మ్యాపింగ్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో విద్యార్థుల మ్యాపింగ్ ప్రక్రియ ప్రధానోపాధ్యాయులు పూర్తి చేశారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులు హయ్యర్ క్లాస్ అనంతరం వేరే పాఠశాలలో చేరాల్సి ఉంటుంది. ఉదాహరణకు ఒక పాఠశాలలో ఒకటి, రెండు తరగతులు ఉంటే, రెండో తరగతి విద్యార్థులను మూడో తరగతిలో వేరే పాఠశాలలో చేరాల్సి ఉంటుంది. ఈ సందర్భంలో విద్యార్థులకు అనువైన పాఠశాలల్లో, తల్లిదండ్రుల అనుమతితో చేర్చాలి. విద్యా సంవత్సరం జూన్ 12 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ నెలలోనే ఏ విద్యార్థి ఏ పాఠశాలలో తదుపరి తరగతి జాయిన్ అయ్యేందుకు ఆసక్తి చూపుతున్నారో ఆ పాఠశాలకు మ్యాపింగ్ చేశారు.

జిల్లాల్లో పరిస్థితి ఇదీ..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 17,258 మంది, తూర్పుగోదావరి జిల్లాలో 20,164, కాకినాడ జిల్లాలో 23,379 విద్యార్థులను మ్యాపింగ్ చేయాలని లక్ష్యం నిర్ధారించుకుని ఈ నెల 25వ నాటికి పూర్తి చేశారు. కోనసీమ జిల్లాలో 2వ తరగతి అనంతరం 3వ తరగతిలోకి 216 పాఠశాలల నుంచి 1,524 మంది విద్యార్థులను, అలాగే 5 నుంచి 6వ తరగతికి 1,146 పాఠశాలల నుంచి 13,382 మంది విద్యార్థులను, 7 నుంచి 8వ తరగతికి 131 పాఠశాలల నుంచి 1,334 మందిని, 8 నుంచి 9వ తరగతికి 57 పాఠశాలల నుంచి 855 మంది విద్యార్థులను మ్యాపింగ్ చేశారు. ఎటువంటి సర్టిఫికెట్లు, టీసీ, రికార్డు షీటు లేకుండానే కేవలం తల్లిదండ్రుల అనుమతితో మ్యాపింగ్‌ను పూర్తి చేశారు.

సమర్థవంతంగా పూర్తి చేశాం



విద్యార్థుల మ్యాపింగ్ ప్రక్రియను గడువులోగా సమర్థవంతంగా పూర్తి చేశాం. దీనికి సంబంధించిన ఆదేశాలను పాఠశాల స్థాయి వరకూ ఇచ్చి నిరంతరం మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించారు. పాఠశాల స్థాయిలో లక్ష్యం మేరకు మ్యాపింగ్ ప్రక్రియను సమష్టిగా నిర్వహించాం.

–ఎం.కమలకుమారి, డీఈఓ, అమలాపురం

నూతన మార్పులపై అవగాహన పెంచుకోవాలి



ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ సెమినార్‌లో రాష్ట్ర హైకోర్టు జడ్జి హరినాథ్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రస్తుత రోజుల్లో ఐటీ, జీఎస్టీ ట్యాక్స్ అసెస్‌మెంట్ తదితర రంగాల్లో వచ్చిన నూతన మార్పులపై అవగాహన పెంచుకోవాలని ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ ఎస్.హరినాథ్ తెలిపారు. కాకినాడలోని దంటు కళాక్షేత్రంలో శనివారం ఆలిండియా ట్యాక్స్ ఫెడరేషన్ ప్రాక్టీషనర్స్, ఏపీ ట్యాక్స్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ట్యాక్స్ ప్రాక్టీషనర్స్‌కు సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా హరినాథ్ మాట్లాడుతూ కోవిడ్ కారణంగా డిజిటల్ పేమెంట్స్ పెరిగాయని, డిజిటల్ పేమెంట్స్‌లో భారతదేశం తొలి స్థానంలో ఉందన్నారు. ట్యాక్స్ ప్రాక్టీషనర్స్, ఛార్టెడ్ అకౌంటెంట్లు అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నారన్నారు. ట్యాక్స్ బార్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు సీతాపతిరావు మాట్లాడుతూ డిగ్రీ చదివి ఈ వృత్తిలోకి వచ్చేవారికి తమ అసోసియేషన్ ద్వారా శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీ ట్యాక్స్ బార్ అధ్యక్షుడు ఎంవీజేవీ కుమార్, జనరల్ కార్యదర్శి రాజు, సభ్యుడు భానుజీరావు పాల్గొన్నారు.

వాడపల్లి.. భక్తులతో శోభిల్లి



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి



ఆలయం వద్ద భక్తుల కోలాహలం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. గోవింద నామస్మరణతో ఆలయం మార్మోగింది. ఉదయం స్వామివారిని వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో వేంచేసి ఉన్న వేంకటేశ్వర స్వామివారి క్షేత్ర పాలకుడు అన్నపూర్ణా సమేత విశ్వేశ్వర స్వామిని దర్శించుకున్నారు. స్వామివారి కల్యాణోత్సవాలు తిలకించే, ఏడు వారాల నోము ఆచరించే భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం రద్దీగా మారింది. ఎలక్షన్ జనరల్ పరిశీలకుడు ప్రదీప్‌కుమార్ వాడపల్లి వేంకటేశ్వరస్వామి, ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆయా ఆలయాల వద్ద సిబ్బంది స్వాగతం పలికి స్వామివారి చిత్రపటాలు, ప్రసాదాలను అందజేశారు. ఈ ఏర్పాట్లను డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. అనంతరం వాడపల్లి ఆలయ ఈఓ కిశోర్‌కుమార్ మాట్లాడుతూ స్వామివారికి ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, వివిధ సేవలు, లడ్డూ విక్రయం, ఆన్‌లైన్ ద్వారా సుమారు రూ 33,38,934 ఆదాయం సమకూరిందన్నారు. ఆలయం వద్ద ఏర్పాటైన అన్న సమారాధనలో వేలాది భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించారు. ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు



మందపల్లి శనైశ్చరాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొత్తపేట: మండలంలోని మందపల్లిలో శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించారు. స్వామి వారి ప్రాతఃకాల అర్చన అనంతరం భక్తులు తైలాభిషేకాలు, సర్వదర్శనాలు చేసుకున్నారు. దేవస్థానం ఏసీ అండ్ ఈఓ కె.విజయలక్ష్మి భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు. టిక్కెట్లు, వివిధ సేవల ద్వారా రూ.97,751 ఆదాయం వచ్చినట్లు ఈఓ మూర్తి తెలిపారు. అలాగే అన్నప్రసాద పథకానికి పలువురు భక్తుల ద్వారా విరాళాల రూపంలో మరో రూ.30,770 ఆదాయం వచ్చినట్టు దేవస్థానం ఈఓ తెలిపారు. సిబ్బంది, పలువురు గ్రామస్తులు అన్నప్రసాద సేవలో పాల్గొన్నారు.

సరదాగా స్నానానికి వెళ్లి..

సముద్రంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి



సురేంద్రవర్మ

కాకినాడ రూరల్: మండలంలోని నేమాం వద్ద సముద్ర స్నానానికి వెళ్లిన జేఎన్‌టీయుకేలో ఇంజినీరింగ్ ఫైనలియర్ విద్యార్థి సరిపెళ్ల సురేంద్రవర్మ (21) మృతి చెందాడు. తిమ్మాపురం పోలీసుల వివరాల ప్రకారం.. కాకినాడ జేఎన్‌టీయూలో సీఎస్ఈ బ్రాంచ్ ఫైనలియర్ విద్యార్థులు సుమారు 25 మంది నేమాం వద్ద బీచ్‌లో స్నానాలు చేసేందుకు శనివారం వెళ్లారు. వారంతా సముద్ర స్నానం చేస్తుండగా సురేంద్ర వర్మ కొద్దిగా లోపలకు వెళ్లడంతో కెరటాల తాకిడికి కొట్టుకుపోయాడు. కొద్దిసేపటికే స్థానికులు, మత్స్యకారుల సహకారంతో సురేంద్రవర్మను బయటకు తీసి గొడారిగుంట వద్ద ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు.

అప్పటికే అతడు ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యులు నిర్ధారించారు. కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం భట్నవిల్లి గ్రామానికి చెందిన సురేంద్రవర్మ మృతితో తోట విద్యార్థులు విషాదంలో మునిగిపోయారు. ఇంజినీరింగ్ ముగించుకుని తమకు చేయూతగా నిలుస్తాడని వెయ్యికళ్లతో ఎదురుచూస్తోన్న సురేంద్రవర్మ తండ్రి విశ్వనాథ్, తల్లి, బంధువులు ఒక్కసారిగా విషయం తెలుసుకుని దుఃఖ సాగరంలో మునిగిపోయారు. తమ బిడ్డ సముద్ర స్నానానికి వెళ్లి చనిపోయినట్టు సమాచారం అందుకున్న తల్లిదండ్రులు సొమ్మసిల్లారు. ఈ మేరకు తిమ్మాపురం ఎస్సై రవీంద్ర బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐస్‌క్రీమ్ తయారీ యూనిట్లపై విజిలెన్స్ దాడి

ధవళేశ్వరం: గ్రామంలోని రెండు ఐస్‌క్రీమ్ తయారీ యూనిట్లపై శనివారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు. శ్రీ వెంకటేశ్వర ఫుడ్స్‌ను తనిఖీ చేసిన విజిలెన్స్ అధికారులు ప్యాకింగ్ లైసెన్స్ లేకపోవడం, స్టాంప్ లేని 30 కిలోల తూకం యంత్రాన్ని వినియోగించడం, మెండెటరీ డిక్లరేషన్ లేకపోవడం గుర్తించి లీగల్ మెట్రాలజీ అధికారులు మూడు కేసులు నమోదు చేశారు. సత్య సాయి ఫుడ్ ప్రొడక్ట్సును తనిఖీ చేసిన అధికారులు గడువు ముగిసిన ఆరు ఆర్టిఫిషియల్ ఫ్లేవర్ ఎమల్షన్ బాటిళ్లను సీజ్ చేశారు. విజిలెన్స్ డీఎస్పీ పి.ముత్యాల నాయుడు మాట్లాడుతూ ఐస్‌క్రీమ్ తయారీ దారులు స్వీట్‌స్టాల్స్, రెస్టారెంట్ల యాజమాన్యాలు వాటి పరిసరాలు కిచెన్‌లు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల సూచనల మేరకు వినియోగదారులకు నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు నాగ వెంకటరాజు, భార్గవ్ మహేష్, జగన్నాథరెడ్డి, నవీన్, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ, రెవెన్యూ, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

నేడూ విద్యుత్ బిల్లుల చెల్లింపులు

రాజమహేంద్రవరం సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లోని విద్యుత్ బిల్లుల వసూళ్ల కౌంటర్లు పని చేస్తాయని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఆయా జిల్లాల్లోని విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలతో పాటు, ఏపీఈపీడీసీఈఎల్ సెక్షన్ ఆఫీస్ కలెక్షన్ కౌంటర్లు, ఏటీపీ సెంటర్లలో సైతం చెల్లింపులు చేయవచ్చన్నారు.

కాలువలో దూకిన వృద్ధుడు!

కడియం: మండలంలోని వేమగిరి వద్ద కాకినాడ కెనాల్‌లోకి ఒక వృద్ధుడు దూకేశాడు. అటుగా వెళుతున్న వారు అతడిని రక్షించారు. కడియం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 55 ఏళ్ల వ్యక్తి శనివారం మధ్యాహ్నం కాకినాడ కెనాల్‌లోకి దూకాడు. అటుగా వెళుతున్న కొప్పిశెట్టి జయప్రకాష్, గ్రంధి రాజు వెంటనే కాలువలోకి దిగి అతడిని రక్షించారు. అనంతరం ఆటోలో కడియం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతున్నాడు. అతడు వివరాలు చెప్పలేకపోతున్నాడని, ఎటువంటి గుర్తింపు కార్డులు లేవన్నారు. వృద్ధుడిని ఎవరైనా గుర్తిస్తే కడియం పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.